క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ బలోపేతానికి సమష్టిగా కృషి చేద్దాం

పార్టీ గుంటూరు నగర అధ్యక్షుడు వనమా బాలవజ్రబాబు



గుంటూరు రూరల్: వైఎస్సార్ సీపీ బలోపేతానికి సమష్టిగా కృషి చేద్దామని ఆ పార్టీ గుంటూరు నగర అధ్యక్షుడు వనమా బాలవజ్రబాబు కోరారు. నగర శివారుల్లోని ఏటుకూరు బైపాస్‌లోని ప్రత్తిపాడు నియోజకవర్గం కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బాలవజ్రబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పూటకు ఒక అబద్ధం ప్రచారం చేస్తూ ప్రజలకు అందించాల్సిన సంక్షేమ పథకాలను ఇవ్వకుండా ప్రజలను, పేద, బడుగు బలహీన వర్గాలను మోసం చేస్తుందని చెప్పారు. ఎన్నికల సమయంలో అబద్ధపు హామీలు ఇచ్చి నేడు ప్రజలను నట్టేట ముంచారన్నారు. అధికారం చేపట్టి ఐదు నెలలు పూర్తయినా నేటికి ఒక్క సంక్షేమ పథకం ప్రజలకు చేరలేదన్నారు. పార్టీ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఉచిత ఇసుక పేరుతో రూ.లక్షల కోట్లు కూటమి ప్రభుత్వం దోచుకుంటుదని ధ్వజమెత్తారు. ఉచిత ఇసుక ప్రజలకు అందని ద్రాక్షగానే మిగిలిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు, ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను ఎండగట్టి ప్రజలకు న్యాయం చేసేందుకు ప్రతి కార్యకర్త, నాయకులు సిద్ధంగా ఉండాలని కోరారు.

ముగిసిన వెబ్ డెవలప్‌మెంట్ శిక్షణ శిబిరం



గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాంలోని చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో పుల్ స్టాక్ (మెర్న్) వెబ్ డెవలప్‌మెంట్ అనే అంశంపై విద్యార్థులకు ఆరో రోజుల శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. బుధవారం కార్యక్రమం ముగింపు వేడుకల్లో ఇన్నోవేటివ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి ఎ.సాయి, వి.రాజేష్ వెబ్ డెవలప్‌మెంట్ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించటం ద్వారా విద్యార్థులు విషయ పరిజ్ఞానం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు జె.భార్గవ్, కె.అరుణకుమారి, 150 మంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఐక్యతా దినోత్సవం



గుంటూరు రూరల్: భారతదేశ అభ్యున్నతికి సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన సేవలు చిరస్మరణీయమని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని పేర్కొన్నారు. బుధవారం చౌడవరంలోని కళాశాలలో మాజీ ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది అధ్యాపక, అధ్యాపకేతర బృందం విద్యార్థులతో కలిసి ప్లకార్డులను చేతబట్టి కళాశాల కూడలిలో ఏక్తా దివాస్ ర్యాలీని నిర్వహించారు. అనంతరం అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు దేశ ప్రగతికి, ఐక్యతకై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ కె.ఉపేంద్రచౌదరి, డాక్టర్ డి.కొండలరావు, డాక్టర్ ఎం.అనిత పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే క్యాన్సర్ నివారణ

గుంటూరు ఎడ్యుకేషన్: క్యాన్సర్‌ను తొలి దశలో గుర్తించడం ద్వారా నూరు శాతం నివారణ సాధ్యమని గుంటూరు సమగ్ర ప్రభుత్వాస్పత్రిలోని నాట్కో క్యాన్సర్ సెంటర్ మెడికల్ అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ టీవీ శివరామకృష్ణ పేర్కొన్నారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో బుధవారం సుజయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా సాధికారత విభాగం సహకారంతో మహిళల్లో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ శివరామకృష్ణ మాట్లాడుతూ ప్రతి 19 సెకన్లకు ఒకరు క్యాన్సర్ బారిన పడుతుండగా, దేశంలో ఇప్పటికే 25 లక్షల మంది క్యాన్సర్ పీడితులు ఉన్నారని వివరించారు. క్యాన్సర్ రోగులకు వివిధ స్థాయిలో చికిత్స ఉంటుందని, కోలుకున్న తరువాత నిరంతరం వైద్యుల పర్యవేక్షణలో పూర్తి స్వస్థత పొందవచ్చని తెలిపారు.

ప్రమిదలు కేరాఫ్ శలపాడు

మట్టి వస్తువులకు ప్రసిద్ధి

- కుటీర పరిశ్రమగా మట్టి వస్తువుల తయారీ
- కార్తికమాసంలో ప్రమిదలకు డిమాండ్
- చేతివృత్తిదారుల కష్టం దళారులపాలు



బట్టీలో కాలుస్తున్న ఎండిన ప్రమిదలు



శలపాడులో రోడ్డుపై ఆరబెట్టిన ప్రమిదలు

శలపాడు(చేబ్రోలు): దీపావళి అంటే దీపాల వరస.. పండుగ వస్తుందంటే పల్లె నుంచి పట్టణం వరకు సందడి. ఊరంతా వెలుగుల కోసం ప్రమీదలకు ప్రత్యేక స్థానం ఉంది. వివిధ ఆకృతుల్లో ఇంటి నుంచి ఆలయాల వరకు ప్రమిదలతో అలకరించడం సంప్రదాయకంగా వస్తోంది. అలాంటి ప్రమిదల తయారీలో అనేక మంది శ్రామికుల కృషి ఉంది. చేబ్రోలు మండలం శలపాడు తయారీ కేంద్రంగా ప్రసిద్ధి చెందింది.

మట్టి వస్తువుల తయారీ...

ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో టెక్నాలజీతో ఆకర్షణీయమైన వస్తువులు తయారు చేస్తున్నా సంప్రదాయ పద్ధతులతో మట్టితో వివిధ రకాల కళాత్మకమైన సామగ్రిని తయారు చేస్తూ శాలివాహనులు జీవనోపాధి పొందుతున్నారు. 250 మంది సంప్రదాయ వృత్తిని కొనసాగిస్తున్నారు. కార్తికమాసం మూడు రోజుల్లో ప్రారంభం కానుండటంతో వృత్తిదారులు బిజీబిజీగా ఉన్నారు. ఎడతెరిపి లేని భారీ వర్షాలు పనులకు ఆటంకం కలిగిస్తూ నష్టాన్ని కలుగ చేసినా ప్రమీదలే తమకు వెలుగు రేఖలని తయారీదారులు చెబుతున్నారు.

వివిధ రకాల వస్తువులు

మట్టి ప్రమిదలు, కూజాలు, కుందులు, కుండలు, కప్పులు, పూదానలు, ఫిల్టర్ కుండలు, చిప్పబుడ్డి కుండలు, ముంతలు, మూకుళ్ల తదితర వస్తువుల తయారు చేస్తున్నారు. దీపావళి సందర్భంగా ప్రమిదలకు మంచి డిమాండ్ ఉంటుంది. కార్తిక మాసంలో ప్రమిదలలో ఇంటి ముందు మహిళలు దీపాలు వెలిగిస్తారు. ప్రస్తుత ఆధునిక కాలంలో లక్షలాది రూపాయలతో నిర్మించిన భవనాల్లో మట్టి ప్రమిదల్లో నూనె దీపాలు వెలిగించటానికి వెనుకంజ వేస్తున్నారు.

ఎలా తయారు చేస్తారంటే..


వడ్లమూడి క్వారీ, సుద్దపల్లి ప్రాంతాల నుంచి తీసుకువచ్చిన నాణ్యమైన ఎర్ర, నల్లమట్టి మిశ్రమాన్ని మెత్తటి ముద్దగా చేసిన తరువాత చక్రంపై వస్తువులను తయారు చేస్తారు. వీటిని బాగా ఆరబెట్టి బట్టీలో పెట్టి కాలుస్తారు. దీని వలన గట్టితనం వస్తుంది. ఐదు రోజుల నుంచి వారం రోజుల్లో మట్టి వస్తువు తయారవుతుంది.

మార్కెట్లోకి కర్నాటక ప్రమిదలు

బెంగళూరు, మైసూరు ప్రాంతం నుంచి రెండేళ్లుగా ప్రమిదలు వివిధ రకాల డిజైన్లతో మార్కెట్లోకి రావటంతో చేతితో తయారు చేసే ప్రమిదలకు డిమాండ్ తగ్గింది. సమీప రాష్ట్రాల్లో ప్రింటింగ్ మిషన్ ద్వారా ప్రమిదలు, మట్టి వస్తువులను తయారు చేస్తున్నారు. అవి వినియోగదారులను ఆకర్షిస్తున్నాయి. చేబ్రోలు, వడ్లమూడి, వేజండ్ల, గరువుపాలెం తదితర ప్రాంతాల్లో ప్రధాన రహదారుల వెంట వివిధ రకాల డిజైన్లతో ప్రమీదల విక్రయాలు జరుగుతున్నాయి. చేతితో తయారు చేసిన మట్టి వస్తువులకంటే ప్రింటింగ్ మిషన్ వస్తువులు తక్కువ ధరకు లభిస్తుండటంతో వినియోగదారులు వీటికి ఆకర్షితులు అవుతున్నారు.

కుమ్మరుల కష్టం దళారులపాలు

రేయింబవళ్లు కష్టపడి మట్టి వస్తువులను తయారు చేసిన శాలివాహనుల కష్టాన్ని దళారులు దోచుకుంటున్నారు. వీరు తయారు చేసిన మట్టి కుండలు, ప్రమిదలు, కూజాలు, మూకుళ్లను తక్కువ ధరకు కొనుగోలు చేసి దళారులు అధిక ధరలకు విక్రయించుకుంటున్నారు. ఒక్కో ప్రమిదను రెండు రూపాయిలకు కొనుగోలు చేసి బహిరంగ మార్కెట్టులో రూ.5లకు విక్రయిస్తున్నారు. మట్టి కుండను రూ.50లకు కొనుగోలు చేస్తున్న వ్యాపారులు మార్కెట్టులో రూ.వంద నుంచి రూ.150కు అమ్ముతూ లాభాలు పొందుతున్నారు.



మట్టి ప్రమిదలను తయారు చేస్తున్న శాలివాహనులు



వడ్లమూడి ప్రధాన రహదారి వెంట ప్రింటింగ్ మిషన్ ద్వారా తయారైన ప్రమిదల అమ్మకాలు

మట్టి వస్తువులకు డిమాండ్



కుటుంబం మొత్తం రోజు కష్టపడి పనిచేస్తే రోజుకు ఐదు వందలు రావటం గగనం అవుతుంది. మట్టి వస్తువులు అకాల వర్షం కురిస్తే నష్టం. ప్రభుత్వం మట్టి వస్తువులు తయారీ చేస్తున్న శాలివాహనులకు ప్రోత్సాహం అందించాలి. మార్కెట్లోకి వివిధ రకాల ఆధునిక యంత్రాలు వాడుకలోకి వచ్చినా ఇక్కడ తయారీ చేస్తున్న మట్టి వస్తువులకు మాత్రం డిమాండ్ బాగానే ఉంది

– సర్దైన వెంకటేశ్వరావు, శలపాడు

ప్రభుత్వ నిర్లక్ష్యంతో అంబేడ్కర్ పేరు తొలగింపు

- దళితులంటే కూటమి ప్రభుత్వానికి చిన్నచూపు
- ప్రత్తిపాడు వైఎస్సార్ సీపీ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్



నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గుంటూరు రూరల్: విజయవాడ నగరంలో వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద అంబేడ్కర్ పేరును కావాలని కొందరు తొలగించారని అందుకు రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరే కారమని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ ధ్వజమెత్తారు. బుధవారం నగర శివారుల్లోని ఏటుకూరులోని పార్టీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ విజయవాడ నగరం నడిబొడ్డున ఏర్పాటు చేసిన రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని చూస్తే కూటమి నాయకులకు కడుపులు మండిపోతున్నాయన్నారు. గతంలో వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరును రాత్రికి రాత్రే దుండగులు తొలగించిన రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదని నిలదీశారు. రెండు రోజుల క్రితం అంబేడ్కర్ పేరును కూడా తొలగించి రాజ్యాంగ నిర్మాతను ఘోరంగా అవమానించారని చెప్పారు. వెంటనే అంబేడ్కర్ విగ్రహం వద్ద తొలగించిన పేర్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తకు పరామర్శ

ఇటీవల గుంటూరులో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలో ప్రమాదవశాత్తు జారిపడిన కార్యకర్తను బలసాని కిరణ్‌కుమార్ బుధవారం పరామర్శించారు. 27వ డివిజన్ నల్లపాడులో సీతారామ టౌన్‌షిప్‌లో నివాసం ఉంటున్న కందుకూరి జ్యోతి, ఇటీవల కార్యక్రమంలో పడింది. పరామర్శించి ఆరోగ్య పరిస్థితి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

బజరంగ్ ఆధ్వర్యంలో 40 వేల మట్టి ప్రమిదలు పంపిణీ

ప్రారంభించిన అంబటి మురళీకృష్ణ



మట్టి ప్రమిదల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అంబటి మురళీకృష్ణ

కొరిటెపాడు(గుంటూరు): పిల్లలు, పెద్దలు ఎంతో ఉల్లాసంగా.. ఉత్సాహంగా జరుపుకునే దీపావళి పండగను పురస్కరించుకొని బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టాభిపురంలోని గ్రీన్ గ్రేస్ ఆవరణలో పర్యావరణ హితంగా 40 వేల మట్టి ప్రమిదల పంపిణీని బుధవారం ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ ప్రారంభించారు. నగర ప్రజలు భారీగా తరలివచ్చి మట్టి ప్రమిదలను తీసుకెళ్లారు. సంప్రదాయబద్ధంగా మట్టి ప్రమిదలు, వత్తులు పకడ్బందీగా ప్యాక్ చేసి అందించడంపై ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ దీపావళి పండుగను పర్యావరణ హితంగా జరుపుకోవాలని సూచించారు. బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమాజహిత పర్యావరణహిత కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతోందని చెప్పారు. గత వినాయక చవితి పండుగ సందర్భంగా ఏడు వేల మట్టి వినాయకులను పంపిణీ చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో బజరంగ్ ఫౌండేషన్ డైరెక్టర్లు సిద్ధినేని శ్రీనివాసరావు, జి.సుబ్బారావు, గ్రీన్ గ్రేస్ ప్రాజెక్టు మేనేజర్ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కృషి చేయాలి

- ఎంపీపీ భవనం పద్మలీల
- మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో వెల్లువెత్తిన సమస్యలు




సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

పొన్నూరు: మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ భవనం పద్మలీల కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఎంపీడీఓ చంద్రశేఖర్ సభకు అధ్యక్షత వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ సర్పంచులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మామిళ్లపల్లి, మన్నవ గ్రామాల సర్పంచులు విద్యుత్ హెల్పర్లు లేని కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. విద్యుత్ ఏఈ మాట్లాడుతూ ఉద్యోగుల కొరత ఉందని ఉన్నవారితోనే పనులు చేయించుకోవాల్సి ఉందన్నారు. పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు వివిధ శాఖలకు సంబంధించి ఎదుర్కొంటున్న సమస్యలను తెలిపారు. అధికారులు పరిష్కారం దిశగా చర్యలు చేపడతామని అన్నారు. ఎంఈఓ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు అపార్ ఐడీ నమోదు జరుగుతుందన్నారు. వ్యవసాయాధికారి వెంకట్రామయ్య మాట్లాడుతూ రబీ 2024లో పంటల బీమాకు ప్రభుత్వం పలు పంటలను ఎంపిక చేసిందని, ప్రతి ఎకరానికి ప్రీమియం చెల్లించాల్సి ఉందన్నారు. మినుము ఎకరానికి రూ.45, పెసర ఎకరానికి రూ.50, జొన్న ఎకరానికి రూ.48, మొక్కజొన్న ఎకరానికి రూ.114 ప్రీమియాన్ని గ్రామ సచివాలయాల్లో చెల్లించి రశీదు పొందాలని పేర్కొన్నారు. ఇటీవల వర్షాలకు పంట నష్టపోయిన 5026 రైతులకు రూ.8.48 కోట్లు ఆధార్‌తో పరిహారం చెల్లించినట్లు తెలిపారు. ఇళ్ల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయని మార్చి లోపు మంజూరైన గృహాలను పూర్తిచేయాలని గృహ నిర్మాణ శాఖ ఏఈ తెలిపారు.

పొన్నూరులో పెరిగిన ఓటర్లు

ముసాయిదా జాబితా ప్రకటన



తహసీల్దార్ జియా

పొన్నూరు: 2025 ఓటర్ల ముసాయిదా జాబితా ప్రకారం పొన్నూరు నియోజకవర్గంలో 2,27,382 మంది ఓటర్లు ఉన్నారు. 2024 ఓటర్ల తుది జాబితాతో పోల్చితే 247 మంది పెరిగారు. బుధవారం తహసీల్దార్ జియావుల్ హక్ వివరాలు వెల్లడించారు. అభ్యంతరాల స్వీకరణ, కొత్త ఓటర్ల నమోదు, చేర్పులు, మార్పులు, తొలగింపులు, తదితర అంశాలను వివరించారు. అభ్యంతరాల స్వీకరణ అనంతరం తుది జాబితాను 2025 జనవరి 6వ తేదీన ప్రచురించనున్నట్లు తెలిపారు. జనవరి 2025 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని యువత వినియోగించుకోవాలని తెలిపారు.

నియోజకవర్గంలో ఓటర్ల వివరాలు..

మండలం	పురుషులు	మహిళలు	ట్రాన్స్‌జెండర్లు	మొత్తం
పెదకాకాని	31231	34292	2	65525
చేబ్రోలు	28883	30712	3	59598
పొన్నూరు పట్టణం	23947	26519	5	50471
పొన్నూరు	25078	26709	1	51788
	109139	118232	11	227382

హరిత దీపావళి జరుపుకుందాం

నగర కమిషనర్ శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగర ప్రజలు దీపావళి పండుగను పర్యావరణ హితంగా జరుపుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. కాలుష్య నియంత్రణ మండలి గో గ్రీన్...గ్లో బ్రైట్ నినాదంతో హరిత దీపావళి జరుపుకోవాలని రూపొందించిన పోస్టర్‌ని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కలెక్టర్ బంగ్లా రోడ్డులోని క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ ఎండీ నజీనా బేగం, డీఈఓ రేణుక, ఉపా సెల్ పీఓ రామారావు, గ్రీన్ కోర్ కన్వీనర్ తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

నేడు నగరంలో 2కే రన్

సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని గురువారం రాష్ట్రీయ ఏక్తా దివస్ 2కె రన్ ఫర్ యూనిటిని స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్ నుంచి హిందూ కాలేజి జంక్షన్ వరకు నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఈ రన్‌లో జిల్లా కలెక్టర్, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని బుధవారం కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో 2కె రన్ ఏర్పాట్లకు సంబంధించి డీఈఓ, డీఆర్‌డీఏ, జిల్లా పరిషత్, జీఎంసీ అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో డీఈఓ రేణుక, జీఎంసీ డెప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వెహికల్ షెడ్‌కి కాంపౌండ్ వాల్ నిర్మించాలి

నగరపాలక సంస్థ వెహికిల్ షెడ్‌ని సమగ్ర సర్వే చేసి, కాంపౌండ్ వాల్ నిర్మాణం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం కమిషనర్ కేవీపీ కాలనీలోని జీఎంసీ వెహికిల్ షెడ్, విద్యా నగర్ 3లైన్‌లను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ వాహనాల పనితీరుని సమీక్షించి, ప్రతి వాహనం రన్నింగ్‌లో ఉండాలని, మరమ్మతులు 24 గంటల్లో పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. నూతన స్వీపింగ్ యంత్రాలను ప్రాంతాల వారీగా మ్యాపింగ్ చేసి, ప్రజారోగ్య అధికారులకు కేటాయించాలని కోరారు. ఈ–ఆటోలను ఏజెన్సీ ప్రతినిధులతో సమన్వయం చేసుకొని పూర్తి స్థాయిలో రన్నింగ్‌లోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

దేశ ఐక్యత, సమగ్రత కాపాడాలి

రైల్వే డీఆర్ఎం రామకృష్ణ

లక్ష్మీపురం: దేశం ఐక్యత, సమగ్రత కాపాడటానికి ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పనిచేయాలని గుంటూరు రైల్వే డివిజనల్ డీఆర్ఎం ఎం.రామకృష్ణ అన్నారు. పట్టాభిపురంలోని గుంటూరు రైల్వే డీఆర్ఎం కార్యాలయంలో బుధవారం రాష్ట్రీయ ఏక్తా దివస్(జాతీయ ఐక్యత దినోత్సవం)ను నిర్వహించారు. ముందుగా రాష్ట్రీయ ఏక్తా దివస్ ప్రతిజ్ఞను డివిజన్ సంబంధిత అధికారులతో కలసి ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ దేశ రాజకీయ ఏకీకరణలో ప్రధాన పాత్ర పోషించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ప్రతి ఏటా అక్టోబర్ 31వ తేదీన పండుగ వాతావరణంలో ఆయన జయంతి కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని చెప్పారు. గురువారం దీపావళి పండుగ నేపథ్యంలో ఒక రోజు ముందుగానే జరుపుకోవడం జరిగిందన్నారు. డివిజన్ పరిధిలోని కింది స్థాయి ఉద్యోగి నుంచి ఉన్నత స్థాయి అధికారి వరకు డివిజన్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయడం వలనే ఇంతటి అభివృద్ధిలో ఉన్నామని వివరించారు. కార్యక్రమంలో డివిజన్ ఏడీఆర్ఎం కె.సైమన్, సీనియర్ డీఓఎం షహబాజ్ హనూర్, సీపీఎం మనోహర్‌రెడ్డి, సీనియర్ డీఈఎన్ కో ఆర్డినేషన్ జె.వి.అనూష, సీనియర్ డీసీఎం డాక్టర్ సిహెచ్.ప్రదీప్‌కుమార్, సీనియర్ డీఓఎం దినేష్‌కుమార్, సీనియర్ డీఎస్‌టీఈ రత్నాకర్, సత్యానారాయణ, సీనియర్ డీఎఫ్ఎం అమూల్య బి.రాజ్, సీనియర్ డీఎంఈ రవికిరణ్, ఏఎస్‌సీ శైలేష్‌కుమార్ పాల్గొన్నారు.

బాణసంచా విక్రయదారులు నిబంధనలు పాటించాలి



పొన్నూరు: బాణసంచా విక్రయదారులు నిబంధనలు పాటించాలని పొన్నూరు అగ్నిమాపక శాఖ అధికారి ప్రసాదరావు అన్నారు. పట్టణంలోని శ్రీ సాక్షి భావన్నారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాల వద్ద అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫైర్ సేఫ్టీ అవుట్ పోస్టును ఆయన సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ప్రాంగణంలోని బాణసంచా దుకాణాలను పరిశీలించి తగిన జాగ్రత్తలు తప్పక పాటించాలని నిర్వాహకులకు తెలిపారు. అగ్నిమాపక శాఖ పేర్కొన్న నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే బాణసంచా కాల్చేటప్పుడు ప్రజలు పలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

సైనికుడు నిజమైన దేశభక్తుడు

మేజర్ డాక్టర్ అమర్‌దీప్



పెదకాకాని: ప్రతి సైనికుడు నిజమైన దేశభక్తుడని, దేశంపై ఉన్న ప్రేమ భారత సైన్యానికి బలమైన పునాది అని గుంటూరు ఆర్మీ రిక్రూట్మెంట్ ఆఫీస్, మెడికల్ ఆఫీసర్ మేజర్ డాక్టర్ అమర్ దీప్ అన్నారు. మండలంలోని వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఎన్‌సీసీ విద్యార్థులు, సాయుధ దళాలలో చేరేందుకు ప్రేరణ కలిగించేలా నిర్వహించిన కార్యక్రమానికి మేజర్ అమర్ దీప్ ముఖ్యవక్తగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేజర్ అమర్ దీప్ మాట్లడుతూ నవంబర్ 10 నుంచి 15వ తేదీ వరకు కడప జిల్లాలో అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ జరగనున్నట్లు తెలిపారు. సాంకేతిక విద్యార్థులు అగ్నివీర్ టెక్నికల్ నియామకాలను అందుకోవచ్చని, ఇంజినీర్లు ఆఫీసర్ క్యాడర్ నియామకాలకు టెక్నికల్, నాన్ టెక్నికల్ విభాగాలకు అర్హులని వివరించారు. అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్ మెంట్ ర్యాలీకు సంబంధించిన ప్రచార ప్రతులను ఎన్‌సీసీ విద్యార్థులు ప్రదర్శించారు. కార్యక్రమలో ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, ఎన్‌సీసీ ఆఫీసర్ సయ్యద్ బీబన్ బీషా, డాక్టర్ ఎ.శ్రీవాణి పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీ.. ఇద్దరికి గాయాలు

చేబ్రోలు: ప్రమాదవశాత్తూ రెండు బైక్ ఢీ కొని ఘటనలో ఇద్దరు యువకులు గాయపడిన ఘటన చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామ శివారులో బుధవారం చోటుచేసుకుంది. నారాకోడూరు గ్రామ శివారులో కొత్తరెడ్డిపాలెం వెళ్లే క్రాస్ రోడ్డు వద్ద గుంటూరు నుంచి కొత్తరెడ్డిపాలేనికి బైక్‌పై వెళ్తున్న యువకుడు రోడ్డు క్రాస్ చేసే సమయంలో చేబ్రోలు నుంచి గుంటూరు వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని వేగంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో గుంటూరులో డిగ్రీ పరీక్షలకు వెళ్తున్న యువకుడికి కాలు విరిగింది. చేతికి, ముఖానికి గాయాలయ్యాయి. సమయానికి 108 వాహనం అందుబాటులో లేకపోవటంతో స్థానికులు ప్రైవేటు వాహనంలో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.